ఎఫెక్టు పూర్తి అయింది.

"ఏఁవిటి మీ కష్టం? మా రాజ్యంలో చీమకూడా కష్టం రాకూడదు!" అన్నారు మంత్రిగారు.

"మనవి చేస్తున్నాను, మహాప్రభో! చీమ సంగతి మాకు తెలీదు కానీ, మా నెమళ్ల తోటలోకి కొండ చిలువలు ప్రవేశించాయి. ఏ చెట్టును చూసినా అవే. ఏ కొమ్మని చూసినా అవే. మాకు నిలువ నీడ లేదు. మమ్మల్ని అక్షరాలా తినేస్తున్నాయి!" అంది ఆ లీడరు గంభీరంగాను, దీనంగానూ.

"ఇక్కడికెంత దూరం మీతోట?" ఈసారి రాజుగారే అడిగారు.

"పది మైళ్లుండవచ్చు!" అన్నాయి నెమళ్లు ముక్తంకంఠంతో.

తోట తక్షణం ఖాళీ చెయ్యమని కొండచిలువలకి ఫర్మానా పంపించేశారు రాజుగారు.

కొండచిలువలు తొణకలేదు, బెణకలేదు.

ఖాళీ చెయ్యలేదు.

సరికదా, "ఏ తోటలోకి రావాలంటే ఆ తోటలోకి వెళ్లడం, కొమ్మలకి చుట్టుకోవడం మా ప్రాథమిక హక్కు. అసలు విష్ణుమూర్తి వారెక్కడ పడుకునేవారు? కాకపోతే మాకు పడగ లేదు. కానీ జాతి ఒకటే కదా! అతని పానుపు మా వంశీయుడే కదా! మరింత మాకెవరూ అడ్డులేదు. రావడానికి వీల్లేదు. మేము వెళ్లం!" అని వాదించాయి.

వాదన కొట్టిపారెయ్యడానికి విష్ణుమూర్తి, చట్టం అడ్డువచ్చాయి.

దేవుడ్ని కాదనే ధైర్యం రాజుగారికి లేదు.

మరీ నెమళ్ళమాటేమిటి?

ఇవి మైనారిటీ అయిపోయాయి.

వీటికేదైనా స్థలం చూపించకపోతే ఇవి ఊరుకోవు.

"పోనీ మీరు ఆ పక్క తోటలోకి వలస వెళ్లండి. ఏ తోట అయితేనేం?" అని మంత్రి నెమళ్లకి నచ్చ చెప్పబోయాడు.

"ఆ మాట ఆ కొండ చిలువలకే చెప్పవచ్చు కదా! మేము కొన్ని తరాల నుండి ఇక్కడే ఉంటున్నాం. మా సెంటిమెంటు మాకుంటుంది కదా!" అంది లీడరు నెమలి.

మంత్రిగారు ఒక్క నిముషం మాట్లాడలేదు.

ఇంతలోరాజుగారు అందుకున్నారు –

"సెంటిమెంటు పక్కన పెట్టండి. కొన్ని తరాలుఇక్కడున్నారు కదా, ఇప్పుడుకొన్ని తరాలు అక్కడ ఉండండి, ఎవరో ఒకరు సర్దుకుపోవాలి కదా!" అన్నారు.

"అంతేలెండి, ఎప్పుడూ బలవంతుడే గెలుస్తాడు!" అని సణుక్కుంటూ ఒప్పుకున్నాయి.

ఆ తరువాత తరచుగా రాజుగారి కోటలోను, వారి సిబ్బంది ఇళ్లలోనూ నెమలి మాంసం వండుతూనే ఉన్నారు.

(ఆంధ్రప్రభ వారపత్రిక, 23.11.1998)

నేలమీద నక్షత్రం

అప్పుడప్పుడు నాకు గొప్ప వేదాంతం వచ్చేస్తుంది.

ఏవిటీ వెధవ జీవితం?

దీని అర్థం ఏమిటీ?

మనం మామూలుగా బతకడం లేదు. బతుకుతో బిజినెస్ చేస్తున్నాం.

మనం విధి చేతిలో కీలుబొమ్మలం అనేవారు.

ఇప్పుడు డబ్బుచేతిలో కీలుబొమ్మలం.

గారడీవాడు కోతిని ఆడించినట్టు, డబ్బు మనల్ని ఆడిస్తోంది.

ఈ జీవితపు పరుగుపందెంలో గెలుపు ఎప్పుడూ డబ్బుదే.

నా వేదాంత ధోరణి ఎంతసేపు సాగేదో కానీ ఇంతలో భూకంపంలా వార్నింగు లేకుండా వచ్చాడు భాస్కరం.

అకాల వర్షంలా అకాల రాకేవిట్రా అన్నాను.

వాడు ముందు ఒక చిరునవ్వు నవ్వాడు. తరువాత సాఫీగా తాపీగా సోఫాలో పుస్తకాలు వగైరా తీసి టేబిలు మీద పెట్టాడు. నిదానంగా సోఫాలో కూర్చున్నాడు. రెండు కాళ్ళూ ఎదురుగా ఉన్న బల్లమీద పెట్టాడు.

మాట్లాడవేం? అన్నాను.

"నీకన్నీ తొందరే. చెప్పేవరకు ఆగవు. ఏవుందీ? వచ్చి పదిహేను రోజులైంది. కథేవిటంటే అమ్మ, నాన్న ఓ అరడజను అమ్మాయిల్ని సెలెక్టు చేసి వుంచారు. కానీ ఎందుకో నాకు ఎవరూ నచ్చలేదు. ఇటు చూస్తే నా సెలవు అయిపోతోంది. పోనీ మరో పది రోజులు పొడిగిద్దామంటే మూఢం వస్తుందిట. మూఢా

చారం వీళ్ళూనూ! ఔనొరే, మనం చదువుకునే రోజుల్లో అంత మంది అందమైన అమ్మాయిలు ఉండేవారు ఇప్పుడు ఎవరూ లేరేవిట్రా?" అన్నాడు దీనంగా.

వాళ్ళంతా పెళ్ళి చేసుకుని లేచి పోయేర్లే! అన్నాను నవ్వి.

"కుళ్ళు జోకులెయ్యకు. ఈ ట్రిప్ వేస్ట్ అయిపోతే మళ్ళీ రావాలి. గాజులబేరం భోజనానికి సరి అన్నట్టు ఆర్జించినదంతా ఈ ట్రిప్పులకే అయిపోతోంది. కానీ గమ్మత్తు చూడు, అనుకోకుండా ఒకమ్మాయి అకస్మాత్తుగా తగిలింది. ఆ అమ్మాయి కూడా నాలాగే పెళ్ళి కోసమే వచ్చిందట. మొత్తానికి సెటిలైపోయింది. అందుకే అంటారు మన పెద్దవాళ్ళు-కళ్యాణమొచ్చిన, కక్కొచ్చినా ఆగదని! అన్నాడుకాళ్ళు ఊపుతూ...

అదంతా డబ్బు-మనిషిని లొంగతీసుకోని కాలంలో, మెడిసన్ ఎడ్వాన్స్ కాని కాలంలో.

ఇప్పుడు అనుకున్న డబ్బు ఇవ్వకపోతే పెళ్ళి ఆగిపోతుంది. సిక్విల్ కానీ, ఎవిల్‌కానీ ఇంజెక్షనిస్తే కక్కు ఆగిపోతుంది. నా ఉద్దేశ్యంలో పెళ్ళి ఒక యాక్సిడెంట్!" అన్నాడు నవ్వుతూ.

వాడు ఫీలవలేదు.

నీ కవిత్వం కాసేపు ఆపు. ఎల్లుండి పెళ్ళి.

ఈ ఊర్లేనే.

ఈ రెండ్రోజులూ నువ్వు నా కేరాఫ్. విన్నావా? అన్నాడు.

విన్నాను. నాకేం చెవుడు లేదు.

వెన్యూఎక్కడ? అడిగాను సెలువు గురించి ఆలోచిస్తూ నా పెళ్ళికైనా ముహూర్తానికి మాత్రమే సెలవిచ్చే మా బాస్ రెండ్రోజులు సెలవు ఇస్తాడా? ఇవ్వడు కాక ఇవ్వడు, సిక్ చెయ్యాలి. చేస్తాను. కానీ సినిమాలో చూపించినట్టు నా ఖర్మకాలి మా బాస్, అమ్మాయి తరపున పెళ్ళికి వస్తే?

"వెన్యూ ఎక్కడన్నావ్?" అన్నాను పరధ్యానంగా.

"నేనేం అన్లేదు. నువ్వే సమాధిలోకి వెళ్ళిపోయావు. అని కళ్యాణమండపం పేరు చెప్పాడు.

నేను తుళ్ళిపడ్డాను. దానికి అద్దె పాతికవేలు పైనే.

ఎంత అయితే నాకేంరా! అదంతా మా మామ వ్యవహారం. పెళ్ళికి పొలిటీషియన్లు, సినిమా వాళ్ళు వగైరా వస్తారుట. మా మావకి కనెక్షన్లు బాగానే ఉన్నాయిలే.

అంచేత వాళ్ళకితగినట్టు చెయ్యాలి కదా! అన్నాను. శెభాష్! పెళ్ళికి వచ్చే వాళ్ళ తాహతుని బట్టి మనం తీసుకుంటావా! అంటే మామూలు మండలపంలో చేస్తే ఈ సదరు గొప్పవాళ్ళు రారా?

ఆ మాట అన్నాను వాడితో - గదనిబట్టి భీముడా? భీముడ్ని బట్టి గదా? అని.

ఒరే! ప్లీజ్, నన్నిలా తినెయ్యకురా! ఈ థియరీలన్నీ వినీవినీ విసుగెత్తి పోయింది.

ఏదో నన్నిలా వదిలేయ్! అన్నాడు దణ్ణం పెడుతూ.

వదిలేద్దామనే అనుకున్నాను. కానీ, మొత్తానికి ఇంక అస్తమానూ ఈ పెళ్ళికోసం రానక్కర్లేదు! అన్న వాడి మాటకి మళ్ళీ రేగాను.

అంటే, నువ్వు ఇన్నాళ్ళూ వస్తున్నది మీ అమ్మ, నాన్నని చూడ్డానిక్కాదన్న మాట! ఏం మనుషులురా? మీకు అమ్మా, నాన్న కంటే డబ్బే ముఖ్యం. అది నీ తప్పు కాదులే. డబ్బురా! డబ్బు! తాచుపాము కుడితే బతకొచ్చు కానీ, డబ్బు కుడితే మరి తిరుగులేదు అన్నాను చిరాగ్గా.

కానీ వాడికేం కోపం రాలేదు సరికదా, చిన్నపిల్లాణ్ణి చూసినట్టు చూసి, నువ్వేం మారలేదురా, అబ్బీ! అందరం చిన్నప్పుడు నీలా కబుర్లు చెప్పిన వాళ్ళమే. కానీ జీవితంలో ప్రవేశించాక అవన్నీ భ్రమలని తేలిపోయింది. కానీ నువ్వింకా ఆ భ్రమలోనే ఉన్నావు. అన్నట్టు ఆ అమ్మాయి గ్రీన్‌కార్డ్ హోల్డర్! అన్నాడు బోధపరుస్తున్నట్టు.

నువ్వింక రాదల్చుకోలేదన్నమాట!

ఎందుకూ రావటం? ఏవుందిక్కడ? అన్నాడు టేబిల్‌మీద పుస్తకాలు సర్దుతూ.

భళ్ళున నవ్వాడు.

ఆ నవ్వుకి టేబిల్ మీద పేపరు ఎగిరిపోయింది. టేబిలు క్రింద పడుకున్న కుక్కపిల్ల గదిలోకి పారిపోయింది.

అదే... అబ్బే లేదు! అన్నాడు గొప్ప సత్యం చెప్తునట్టు.

నేనేం మాట్లాడలేదు. వీడు చదివిన బోడి బియస్సీకి, అదైనా వాయిదాల పద్ధతి, అమెరికా వెళ్ళిపోవాలన్న కోరిక మాత్రం తెగుండేది. కోరిక తప్ప కృషి లేదు. ఇక్కడ చెల్లలేదు. ఎవరో ఫ్రెండ్ తోక పట్టుకుని ఎగిరిపోయాడు. అక్కడ కప్పులే కడిగాడో, రోడ్లే తుడిచాడో మనకి తెలీదు. కాకపోతే అక్కడ డిగ్నిటీ ఆఫ్ లేబర్. ఇక్కడ పరువు తక్కువ. ఎందులోనో పి.హెచ్‌డి. చేశాడు

దానిదేం వుంది? అక్కడ పిడకలు చెయ్యటంలో కూడా పి. హెచ్‌డి. చెయ్యెచ్చు. కొన్నాళ్ళు ఆటోమొబైల్ వర్క్‌షాప్ పెట్టాడు. ఇక్కడ గ్యారేజి అంటారు. మరి కొన్నాళ్ళు డిపార్ట్‌మెంట్ స్టోర్ పెట్టాడు. ఇక్కడ కిరాణాషాపంటారు. బాగానే ఆర్జించాడు. ఇక్కడ ఎలాగైనా బతగ్గలం అన్నధైర్యం ఉంటే మాత్రం అమెరికా వెళ్ళడం అన వసరం అన్నాడుఆ మధ్య ఒకాయన. అది ముమ్మాటికీ నిజం అనిపిస్తోంది నాకు.

పక్కింట్లో పరమాన్నం తినేకంటే మన ఇంట్లో చారు అన్నం తినటం మంచిదని నా అభిప్రాయం. కానీ నా అభిప్రాయం ఎవడిక్కావాలి?

ఏవిట్రా?

వెధవ ఆలోచనలుమాని, లే! లే! మన అభిప్రాయాలు ఎప్పుడూ చుక్కెదురే. అలా పోయి ఏదైనా మంచి హోటల్లో భోంచేసి, కాసేపు హాయిగా తిరుగొద్దాం! అన్నాడు లేస్తూ...

ఇంక తప్పదు.

కార్లో వెళ్తున్నంతసేపూ అమెరికా లైఫ్ గురించి చెప్తూనే ఉన్నాడు. ఇండియాని తిడుతూనే ఉన్నాడు.

ఏవిట్రా ఇవి? రోడ్లేనా? ఛీ! చీ! ఒక్కడికీ ట్రాఫిక్ సెన్స్ లేదు. షిట్‌ఔ (ఈ మాటకి అర్థం నాకు తెలీదు. కానీ అమెరికా వెళ్ళి వచ్చిన ప్రతివాడూ వాడతాడు). ఈ దేశం ఇంక బాగుపడదురా, అబ్బీ! అసలా సిగ్నల్స్ ఎందుకున్నట్టు? పోలీసులు ఆడుకోవ డానికా? నాకందుకే రావాలంటే భయం...!.

అలా తిడుతూనే ఉన్నాడు.

టిపికల్ నియోరిచ్ మెంటాలిటీ.

ఇదే రోడ్ల మీద వాడు సిగ్నల్ లేకపోయినా ఝూమ్మని వెళ్ళి పోయి పోలీసులకి ఎన్నిసార్లు ఫైను కట్టాడో! ప్రతివాడు గతం మరచిపోతాడు.

సిగ్నల్ ఆగిపోయింది.

మేమూ ఆగాం.

వెనక, ముందు, ప్రక్కన, ఎటు చూసినా కార్లు, లారీలు, బస్సులు వీటి మధ్య తప్పిపోయిన కుక్కపిల్లలా ఒకమ్మాయి అటు ఇటు తిరుగుతోంది. పదేళ్ళుంటాయి.

నాటిన తరువాత చెయ్యి కడుక్కున్న నీళ్ళు తప్ప, మరింక చెమ్చాడు నీళ్ళు కూడా ఎరగని వాడిపోయిన మొక్కలా ఉంది.

చిరిగిన గౌను, పుట్టిన తరువాత నూనె ఎరగని జుత్తు.

చంకన మరో చిన్నపిల్ల. ఆ పిల్ల పుట్టినది పుట్టినట్టు ఉంది.

పుట్టిన దగ్గర్నుంచి ఏడిచి ఏడిచి మరింక ఏడవలేక సొమ్మ సిల్లిపోయినట్లు వుంది.

ఒక చేతిలో ఆ చిన్నపిల్ల, రెండో చేతిలో ఒక డబ్బా.

కారు దగ్గరకొచ్చి నిల్చుంది.

సడన్‌గా సిగ్నలిస్తే ఆ పిల్ల దేనికిందైనా పడిపోతుందో, ఏవిటో? భగవాన్!

గబుక్కున జేబులో చెయ్యిపెట్టాను. రూపాయి తగిలింది. తీసి డబ్బాలో వేశాను.

డబ్బాతోనే దణ్ణం పెట్టివెళ్ళిపోయింది.

ఛీ! ఛీ! అలా పిల్లని రోడ్డుమీద వదిలెయ్యడానికి ఆ తల్లికి బుద్ధి ఉండొద్దూ? విసుక్కున్నాడు భాస్కర్.

లేమికి ఏదీ ఉండదు! అన్నాను సీరియస్‌గా, సిగ్నల్ ఇచ్చారు.

మాముందున్న ఆటో స్టార్ట్ కాలేదు.

హారన్ అదేపనిగా కొడుతున్నాడు భాస్కర్.

వాడి తెలివి తక్కువకి నవ్వొచ్చింది.

రాస్కెల్! ఎప్పటికీ కదలడేం? విసుక్కున్నాడు.

ఇంజన్ స్టార్ట్ కాపపోతే వాడేం చేస్తాడు? అన్నాను.

వాడికి అసహనం పెరిగిపోతోంది.

ఈ రెండు నిమిషాలకి ఇంజను ఆపడం ఎందుకు? విసు క్కున్నాడు.

పెట్రోలు కోసం. మేము పొదుపు చెయ్యాల్సింది డబ్బు కాదు. పెట్రోలు, మంచినీళ్ళు! అన్నాను.

హమ్మయ్య ఆటో కదిలింది.

సిగ్నల్ మారుతోంది.

మా వాడు స్పీడుగా లాంగిచేశాడు.

నీకింకా ఆ కమ్యూనిస్టు కబుర్లు పోలేదు. అన్నాడు రోడ్డువేపే చూస్తూ.

పోవు అన్నాను.

నువ్వీ జన్మకి బాగుపడవు! అన్నాడు శపిస్తున్నట్టు.

నువ్వనుకున్న బాగు నాకక్కర్లేదు! అన్నాను.

మొత్తానికి హోటల్ చేరాం.

ఆ హోటల్ ఈ మధ్యనే కట్టారుట.

ఆకాశంలోంచి చూస్తే ఎవరో రాజులు కట్టిన కోటలా ఉంది.

గేటు నుండి హోటల్ మెట్ల వరకు రోడ్డుకి ఇటు, అటు ఉన్న పువ్వుల మొక్కలు, వచ్చిన వాళ్ళని ఆహ్వానించడానికి బొకేలు పట్టుకుని నిల్చున్న కన్నెపిల్లల్లా ఉన్నాయి.

కాంపౌండులో ఉన్న పెద్ద పెద్ద చెట్లు రాజుగారి కోటకి కాపలా కాస్తున్న సిపాయిల్లా ఉన్నాయి.

కారు ఆగగానే సిపాయిలా ఉన్న వాడొకడు వచ్చి కారు తలుపు తీశాడు.

డబ్బున్న వాళ్ళు కారుతలుపు తీసుకోరు. ఎవరైనా వచ్చి తియ్యాలి. ఆరిస్టోక్రసీ లక్షణం.

నేను మాత్రం రెండోవైపు దిగేశేను.

పాలరాతి మెట్లు.

నడిస్తే మాసిపోతాయమో!

లాంజ్‌లో ఖరీదైన బట్టల్తో, ఖరీదైన నవ్వుతో ఉన్న అమ్మాయి విష్ చేసింది.

హోటళ్ళలోను, ఆఫీసుల్లోను రిసెప్షన్లో అమ్మాయిలే వుంటారుమరి.

లోపలకెళ్ళాం.

నేలంతా బ్లాక్ గ్రానైట్. నూనె ఒంపినట్టు మెరుస్తోంది. అందులో చూసి తలదువ్వుకోవచ్చు. కాలు జారిపోతుందో ఏవిటో!

పైన అంతా కన్సీల్డ్ లైటింగ్.

డిమ్ బల్బులు మబ్బులో ఉన్న నక్షత్రాల్లా మినుకు మినుకు మంటున్నాయి.

ఆ బల్బుల నీడలు గ్రానైట్ మీదపడి నేలని రాలిన నక్షత్రాల్లా ఉన్నాయి.

తొక్కేస్తానేమోనన్న భ్రమ.

అపుడే నాకు కృష్ణశాస్త్రి రాసిన "ఆకాశాన ఆ మణిదీపాలే ముత్తైదువలుంచారో ఈ కోనేట ఈ చిరుదివ్వెలు చూసి చుక్కలనుకున్నారో!" అన్ని పాట గుర్తొచ్చింది.

హాల్లో వున్న ఫౌంటేన్ దగ్గర ఓ పాలరాతి అమ్మాయి స్నానం చేస్తోంది.

ఫౌంటెన్ చుట్టూ ఉన్న బండరాళ్ళు ప్లాస్టిక్ మొక్కలు.

ఏదో పాట ఫాస్ట్‌బీట్‌లో వినిపిస్తోంది.

భాష అర్థం కాలేదు.

ఓ టేబిలు దగ్గర కూర్చున్నాం.

ఒంటిమీద ఇస్త్రీ చేసినంత ట్రిమ్ యూనిఫారం వేసుకున్న వెయిటర్ వచ్చి మాదగ్గర నిల్చున్నాడు. లైట్లు ఎంత డిమ్‌గా ఉన్నాయంటే పరాగ్గా ఉంటే పక్కవాడి ప్లేట్లోది తినేస్తాం.

చుట్టూ చూశాను.

ఎదురుగా పాతికేళ్ళ అబ్బాయి. ఇరవైఏళ్ళ అమ్మాయి. ఆ అమ్మాయి తల అతని భుజంమీద ఉంది.

నవ్వుతూ తింటున్నారు.

తింటూ నవ్వుతున్నారు.

మధ్య మధ్య ఆ అబ్బాయి అమ్మాయి బుగ్గ గిల్లుతున్నాడు.

ప్రేమాతురాణం న భయం న లజ్జ!

పక్క టేబిలు దగ్గర రెండు సూట్లు వ్యవహారం మాట్లాడుకుంటున్నాయి.

ఇది కట్టడానికి ఎంత ఖర్చు అయిందో? అన్నాను మెనూ కార్డు తీస్తూ.

మళ్లీ మొదలెట్టావా? అవి నాతో అని, ముందు రెండు సూప్ తీసుకునిరా! అన్నాడు వెయిటర్‌తో.

అబ్బే, ఏం లేదు. కొన్ని వందలకోట్లు ఆయుంటుంది. ఇది కేవలం డబ్బుగలవాళ్ళు, డబ్బుగలవాళ్ళ కోసం కట్టినది. శ్రీశ్రీ చెప్పినట్టు డబ్బు డబ్బుని ప్రేమిస్తుంది. ఇదే డబ్బుతో ఒక పది మంది మిడిల్‌క్లాస్‌కి పనికొచ్చే హోటళ్ళు కడితే ఎంత బాగుంటుంది? అన్నాను.

ఓరే బాబూ! నా సరదా పాడుచెయ్యకురా! నా కోసం భరించు! బతిమాలాడు వాడు.

ఔన్నిజమే వాడి సరదాని పాడుచేసే హక్కు నాకులేదు.

ఎదురుగా ఉన్న లవర్స్ లేచారు.

వెంటనే ఓ పదిపన్నెండేళ్ళ కుర్రాడు గబగబా వచ్చి పెద్ద బేసిన్లోకి ఆ ప్లేట్లు వేశాడు.

నిజానికి ఆ ప్లేట్లలో ఏదీ వాళ్ళు తినలేదు. ఒక్క క్షణం ఒక్క క్షణం...

ఆ ప్లేటు తీస్తున్నప్పుడు వాడి కళ్ళలోని భావం శ్రీశ్రీ కనక చూస్తే గుండె నీరయ్యే పద్యం రాసేవాడు.

రా.వి. శాస్త్రిగారు చూస్తే కడుపు చెరువైపోయే కథ రాసే వారు.

నేను శ్రీశ్రీని కాను.

రా.వి. శాస్త్రిని కాను.

అంచేత వాడి భావం చదవగలిగానే కానీ రాసే భాష నా దగ్గర లేదు.

వచ్చినవాళ్ళు కావాలనుకుంటే ఆ మిగిలినవి పాక్ చేయించి కుక్కలకి తీసుకెళ్తారు. కానీ సర్వర్లు, క్లీనర్లు మాత్రం తినురు.

అది ఆ హోటల్‌కి అవమానం.

సూప్ వచ్చింది రెండు బౌల్స్‌లో.

అందులో చిన్న బ్రెడ్ ముక్కలు చచ్చిపోయిన చేపపిల్లల్లా తేల్తున్నాయి.

పక్కప్లేట్లో నాలుగు అప్పడాలు ఎగిరి పక్కవాడి ప్లేట్లో పడ్డాయి.

అతనికి సారీ చెప్పి వాటిని తీశాడు భాస్కర్.

ఏవిట్రా వెధవ నువ్వు? అన్నాడు కోపంగా.

లేకపోతే ఏవిట్రా? ఆకలికి సూప్ తాగి, తర్వాత అన్నం తింటావా? అంతకంటే ఆకలేసినప్పుడే అన్నం తింటేపోదా? దాన్ని మనం కొనుక్కోవాలా? అన్నాను నవ్వు ఆపి.

ఇంతలో భోజనం వచ్చింది.

దాని ఖరీదు తల్చుకుంటే నాకు తినాలనిపించలేదు.

ఈ హోటళ్ళలో పారేసే తిండితో ఒక చిన్నగ్రామం బత కొచ్చు. ఇవన్నీ నేషనల్ వేస్ట్,.

ఎలాగో తిన్నాననిపించాను. ఇంకా చాలా మిగిలిపోయాయి. అవి కుక్కకి పాక్ చెయ్యమన్నాను.

కార్లో వాడేదో పెళ్ళి కబుర్లు చెప్తూనే ఉన్నాడు. నేను వింటున్నానే కానీ, కళ్ళు రోడ్డు వెతుకుతున్నాయి. ఆ పిల్ల కనిపిస్తే బావుణ్ను. ఇంత రాత్రివేళ ఇంకా రోడ్డుమీద ఎందుకుంటుంది?

ఉంది!

కారాపు! అరిచాను.

తుళ్ళిపడి ఆపాడు భాస్కర్!

ఆ అమ్మాయి ఆ చిన్నపిల్లని పేవ్‌మెంట్‌మీద పడుకోబెట్టి పక్కన కూర్చుంది.

నేను కారు దిగి ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళాను.

ఇంటికెళ్ళలేదా? అడిగాను.

ఇల్లు లేదు అంది నెమ్మదిగా.

అమ్మ, నాన్న...

సచ్చిపోనారు అంది బిక్క మొహంతో...

ఒక్క నిమిషం నిశ్శబ్దం.

నెమ్మదిగా ఆ పాకెట్ ఆ అమ్మాయికిచ్చాను.

అ అమ్మాయి మొహంలో వెలుగు జన్మలో మరిచిపోలేను.

అది చాలు ఈ జన్మకి!.

(ఆంధ్రప్రభ, వారపత్రిక 30.3.1998)

దాత

చీమలు దూరని చిట్టడివి.

కాకులు దూరని కారడవి.

హెడ్డు వెంకటస్వామి మాత్రం ఆ అడవిలో దూరేశేడు.

అతను ఫారెస్టు డిపార్టుమెంటు కాదు.

యాంటీ నక్సలైట్ స్క్వాడ్ వచ్చేడు.

అయితే ప్రస్తుతం అతను ఆ అడవిలో తిరుగుతున్నది నక్స లైట్ల కోసం కాదు.

చింతపండు కోసం.

ఆ అడవుల్లో చింతపండు, కుంకుడుకాయలు అతి చవగ్గా దొరుకుతాయి. కొండవాళ్ళకి ధరలు తెలీవు, తూకాలు తెలీవు.

ఎంతో కొంతకి ఇచ్చేసి పోతారు. వాళ్ళదగ్గర రూపాయికి కొని పది రూపాలకమ్ముకుంటారు షావుకార్లు.

అంచేత చింతపండు కొనడం కూడా తన డ్యూటీలో కలుపు కున్నాడు వెంకటస్వామి.

ఆవేళ అడవంతా తిరగ్గా, తిరగ్గా కాళ్ళు లాగేస్తున్నాయి.

అలా ఒక చెట్టు కింద చేరబడి కూర్చున్నాడు.

చిన్న మాగన్ను పట్టింది. పక్కన ఎండుటాకుల గలగల.

కళ్ళు విప్పేడు.

ఎదురుగా ఉన్నది చింతపండు అమ్మే కొండపిల్ల కాదు.

మంచి వయసులో ఉన్న చిరుతపులి.